కథ

# బంగారు సీత

వాణిశ్రీ

ఇంటిముందు జీప్ ఆగింది. రాఘవేంద్రరావు జీప్‌లో నుంచి దిగాడు. అప్పుడు రాత్రి పదయింది. నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ హాల్లోకి వచ్చి బూట్లు విప్పి సోఫాలో కూలబడ్డాడు.

''ఇంత లేటయిందేమిటండీ?'' శశికళ అడిగింది మంచి నీళ్ళు అందించి.

''ఏం చేస్తాం. ఫీల్డులో వుద్యోగం. టైమ్ చూసుకుంటే కుదరదు'' అన్నాడు రాఘవేంద్రరావు.

''స్నానం చేసి రండి. భోజనం వడ్డిస్తాను'' అని వెళ్ళిపోయింది శశికళ.

రాఘవేంద్రరావు ఆర్ అండ్ బిలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్. ఎప్పుడూ రోడ్ల వెంబడి తిరుగుతుండాలి. కాంట్రాక్టర్ చేస్తున్న పని, సూపర్‌వైజర్లు, జూనియర్ ఇంజనీర్లు సరిగా పర్యవేక్షిస్తున్నారా లేదా? అని చూస్తుండాలి. లేదా చూస్తున్నట్లు నటిస్తూ కర్రపెత్తనం చేస్తుండాలి.

భోజనం చేసి బెడ్‌మీద వాలాడు రాఘవేంద్రరావు. శశికళ వచ్చి అతని మీద చెయ్యి వేసింది.

''ఏంటీ నీరసంగా వున్నారు?'' గోముగా అడిగింది.

''నీరసంకాక ఏముంది? నేనేమైనా ఏ.సి. రూముల్లో పనిచేస్తున్నానా? పగలంతా ఎండలో కాగిపోతున్నాను. చెమట కారి కారి సాయంకాలానికి నీరసం. అదీగాక ఇంకా కుర్రాడినా! నలభై నిండిపోతేను'' అన్నాడు.

శశికళ నవ్వింది.

''అన్నట్లు మీ నాన్న ఇంకా వ్యాపారం వదిలిపెట్టడా? అరవై ఏళ్ళు నిండుతుంటేనూ?'' అన్నాడు నవ్వుతూ.

''ఏం? ఉద్యోగం మానేసి, ఆ వ్యాపారంలోకి దూకుదామని చూస్తున్నారా?'' అన్నది.

''అంతేగా మరి'' అన్నాడు రాఘవేంద్రరావు.

★ ★ ★

ఇదే సమయంలో శశికళ చెల్లెలు చంద్రకళతో ఆమె భర్త సూర్యకిరణ్ కూడా అదేమాట అడిగాడు.

''మీ నాన్నకి అరవై ఏళ్ళు నిండుతున్నాయిగా? ఇంకా ఎన్నాళ్ళు చేస్తాడు ఆ బిజినెస్?''

చంద్రకళ నవ్వింది.

''మా నాన్న బిజినెస్ సంగతి మీకెందుకు? ఆయనకి ఓపికున్నంత వరకూ చేస్తాడు'' అన్నది చంద్రకళ.

''ఎందుకేంటి? ఈ వుద్యోగం బోర్ కొడుతోంది. కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్స్ వెంట తిరగలేక ఛస్తున్నాను. నా ఏరియా అంతా వి.ఐ.పీ.లు చచ్చారు. ఎక్కడో లోడ్ ఎక్కువైపోయి కరెంట్ పోతుంది. ఇక ఫోన్ల మీద ఫోన్లు. పగలు, రాత్రి అని తేడా వుండడం లేదు'' విసుగ్గా అన్నాడు సూర్యకిరణ్.

అతను ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ఇంజనీర్.

''ఉద్యోగం బోర్ కొడుతుంటే మానేస్తారా?'' నవ్వుతూ అడిగింది చంద్రకళ.

''ఆ..మానేద్దామనే. మీ నాన్న రిటైరైపోయి అల్లుళ్ళకు పెత్తనం ఇస్తే ఇక ఈ బోడి వుద్యోగం ఎందుకూ?'' అన్నాడు.

''అబ్బా! ఎంతాశ?'' అన్నది.

''ఇందులో ఆశ ఏవుంది? ఎప్పటికైనా, ఎంత సంపాదించినా అంతా అల్లుళ్ళకు ఇవ్వాల్సిందేగా?'' అన్నాడు సూర్యకిరణ్.

''ఇవ్వాలని ఏవుంది? సంపాదిస్తున్నదంతా ఆయన స్వార్జితం. ఈ శతాబ్దమంతా చారిటీస్‌దే అని బిల్‌గేట్‌లో ఎవరో అన్నారు. మా నాన్నగూడా ఏ వృద్ధాశ్రమానికో రాసిస్తాడేమో'' అన్నది చంద్రకళ నవ్వుతూ.

''మీ నాన్నకి అంత సీన్ లేదులే'' అన్నాడు సూర్యకిరణ్.

★ ★ ★

శశికళ, చంద్రకళల తర్వాత అమ్మాయి గీత బెంగుళూరులో వుంటున్నది. గీత భర్త ప్రభు కస్టమ్స్‌లో పనిచేస్తున్నాడు.

గీత కూతురు బర్త్‌డేకి రమ్మని అక్కలిద్దరికీ ఫోన్ చేసింది.

అంతా బెంగుళూరు చేరుకున్నారు.

రాజగోపాలరావుకి గార్మెంట్స్ ఇండస్ట్రీ వుంది. ఆయనకు ముగ్గురూ కూతుళ్ళే. ముగ్గురు అమ్మాయిల తర్వాత అబ్బాయి పుడితే అరిష్టమని నమ్మిన ఆయన భార్య త్రిపురసుందరి భర్తని బర్త్‌కంట్రోల్ ఆపరేషన్ చేసుకోమన్నది. ''అరిష్టం ఏంటి నాన్సెన్స్. నేను చేసుకోను పో'' అన్నాడు రాజగోపాలరావు. త్రిపురసుందరి మూఢనమ్మకంతో భయపడిపోయి తనే ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకుంది. ఎటూ మగసంతానం లేదుకాబట్టి కోట్ల ఆస్తి తమదే అని అల్లుళ్ళు ధీమాగా వున్నారు. ఆస్తి తమదే ఎప్పటికైనా, కానీ ఎప్పుడు అనేదే ఇప్పుడు ప్రశ్న.

గీత కూతురు బర్త్‌డేకి రాజగోపాలరావు బిజీ షెడ్యూల్ వల్ల రాలేకపోతున్నానని కొరియర్లో ప్రజెంటేషన్ పంపించాడు మనవరాలికి. త్రిపురసుందరి తనకు సుగర్ ఎక్కువైపోయిందనీ ఇల్లు కదలలేననీ ఫోన్లోనే మనవరాలికి హేపీ బర్త్‌డే చెప్పింది.

బర్త్‌డే హడావుడి అయిపోయాక ముగ్గురు అల్లుళ్ళు, కూతుళ్ళు సమావేశమయ్యారు.

అజెండా మావగారికి బిజినెస్ గొడవల నుంచి విముక్తి కలిగించి విశ్రాంతినివ్వడం. (ఆస్తిని తొందరగా పంచుకోవడం) అందుకు భవిష్యత్ ప్రణాళిక సిద్ధం చేయడం. (యాక్షన్ ప్లాన్)

''మావగారికి అరవై ఏళ్ళు నిండుతున్నాయి. ఇంకా డబ్బు సంపాదించాలనే యావ తగ్గడం లేదు. ఇరవై నాలుగు గంటలూ బిజీ...బిజీ! మనవరాలికి బర్త్‌డేకి కూడా రాలేక పోతున్నాడంటే చూడండిక ఎంత బిజీనో. వయసులో సరే. ఇలా వయసు మీరాక యంత్రంలా పనిచేస్తుంటే ఆరోగ్యం ఏం కావాలి?'' అని తన ఆందోళన వెలిబుచ్చాడు పెద్దల్లుడు రాఘవేంద్రరావు.

''యూ ఆర్ కరెక్ట్. స్టేట్ గవర్నమెంట్‌లో ఏభై ఎనిమిదేళ్ళకే రిటైర్‌మెంట్. సెంట్రల్లో అరవై. మావగారు స్టేట్ కాదు, సెంట్రల్ అనుకుందాం. అరవై నిండగానే రిటైరైపోవాలి గదా!'' అని రెండో అల్లుడు సూర్యకిరణ్ వంతపాడాడు.

''మీరేదో మావగారిని స్టేటూ, సెంట్రలూ అని స్టాంప్ వేసేస్తే ఆయన ఒప్పుకుంటాడా? అందులోనూ మనల్ని ఆయన బిజినెస్‌లోకి తీసుకోలేదు. ఒక్కసారిగా మీరు దిగిపోయి ఆ కుర్చీలో మమ్మల్ని

కూర్చోబెట్టండి అంటే ఆయన ఇష్టపడతాడా? ఈ బిజినెస్ మీకేం తెలుసు? ఎలా నిర్వహిస్తారు అని ఎదురుదాడికి దిగితే ఏం చెప్తాం?'' అన్నాడు చిన్నల్లుడు ప్రభు.

''పూర్తిగా ఎందుకు దిగిపొమ్మంటాం? ఆయన్ని చీఫ్ ఎడ్వయిజర్‌గా వుండమందాం. సక్సెస్‌ఫుల్‌గా నడుస్తున్న వ్యాపారం యజమానులు మారినంత మాత్రాన ఆగిపోతుందా? ఆటోమేటిక్‌గా నడుస్తుంది. ఆయనకు ఆమాత్రం తెలియదా?'' అన్నాడు పెద్దల్లుడు.

''మరికనేం మంచి సందర్భం చూసి మావగారిని అడిగేద్దాం. ఈ వుద్యోగం చెయ్యలేకపోతున్నాను బాబూ!'' అన్నాడు ఎలక్ట్రికల్ ఇంజనీర్ సూర్యకిరణ్.

''మంచి సందర్భం అంటే మావగారిని మంచి మూడ్‌లోకి తీసుకెళ్ళాలి. ఎటూ మావగారికి అరవై ఏళ్ళు నిండుతున్నాయి. కాబట్టి ఆయన షష్టిపూర్తి మహోత్సవం అని గ్రాండ్‌గా చేద్దాం. మావగారు ప్లీజైపోతాడు. అప్పుడు అడుగుదాం'' అన్నాడు ప్రభు.

ముగ్గురు కూతుళ్ళూ చప్పట్లు కొట్టి తమ ఆనందం వ్యక్తపరిచారు.

''ఇప్పుడే నాన్నకి చెప్తా!'' అన్నది పెద్దకూతురు శశికళ వుత్సాహంగా సెల్‌ఫోన్ తీసి.

''ఇంకా ఆర్నెల్లు వుంది షష్టిపూర్తి. ఇప్పుడు చెప్పడం ఎందుకూ?'' అన్నాడు పెద్దల్లుడు రాఘవేంద్రరావు.

''ఆయన మీద మనకు ఎంత ప్రేమ వుందో తెలుసుకుంటాడు. ఆర్నెల్ల ముందే అరేంజ్‌మెంట్స్ మొదలుపెట్టారని సంతోషిస్తాడు'' అంటూ సెల్‌ఫోన్ బటన్స్ నొక్కసాగింది శశికళ.

''నేను అమ్మకు చెప్తాను'' అంటూ అక్కతో పోటీపడింది చంద్రకళ.

''హలో నాన్నా! నీకు షష్టిపూర్తి మహోత్సవం చెయ్యాలని మీ అల్లుళ్ళు నిర్ణయించారు'' అన్నది శశికళ.

''ఎందుకమ్మా! అటువంటి ఆర్భాటాలు? మనమేమైనా జమీందారు వంశస్తులమా, అటువంటివి వుత్సవాలు చేసుకుని వూరేగడానికి? నేను టైలర్‌గా జీవితం మొదలు పెట్టి ఈ స్థితికి చేరుకున్నాను. రూపాయి, రూపాయి కూడబెట్టి డబ్బు సంపాదించాను. అనవసరపు ఖర్చులంటే నాకు పడదు'' అన్నాడు రాజగోపాలరావు.

''నీ డబ్బులు ఖర్చుపెట్టంలే. మీ అల్లుళ్లే పెడతారు'' అన్నది శశికళ.

''డబ్బు ఎవరు పెట్టారని కాదమ్మా! అవసరమా? అనవసరమా? అన్నదే ముఖ్యం''

''ఇటువంటి సందర్భం ఎప్పుడూ వస్తుందా? వచ్చినప్పుడు డబ్బు ఖర్చుపెట్టాలి. లేకపోతే ఇంకెందుకు డబ్బు? ఎంత సంపాదించీ ఏం చేస్తారు? మీ అల్లుళ్లు నిర్ణయించారు. నీకు షష్టి పూర్తి జరిపిస్తాం అంతే'' అన్నది శశికళ.

రాజగోపాలరావు నవ్వాడు.

''సర్లేమ్మా! మీ ఆనందం ఎందుకు కాదనాలి'' అన్నాడు.

''అమ్మా! నీకూ నాన్నకు పెళ్ళి చెయ్యాలనుకుంటున్నాం'' అన్నది చంద్రకళ ఫోన్లో.

''నాకూ మీ నాన్నకూ పెళ్ళేమిటే నీ మొఖం?'' అన్నది త్రిపురసుందరి.

''అదేనమ్మా షష్టిపూర్తి. మీ అల్లుళ్ళు మీకు షష్టిపూర్తి చెయ్యాలనుకుంటున్నారు''


''ఏం షష్టి పూర్తో? నాకేం బాగాలేదమ్మా! అడుగుతీసి అడుగు వెయ్యలేకపోతున్నాను. సుగర్ ఎక్కువై పోయింది. ఏం తినకపోయినా ఈ శరీరం తగ్గడం లేదు. ఇప్పుడు ఈ ఆర్భాటాలు ఎందుకే?'' అన్నది త్రిపురసుందరి ఆయాసపడుతూ.

''ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోమ్మా! డాక్టర్ చెప్పినట్లు మందులు వేసుకో'' అన్నది చంద్రకళ.

''షష్టిపూర్తి హైదరాబాద్‌లో ఎక్కడ చేద్దాం? గ్రాండ్ కాకతీయలోనా? తాజ్ కృష్ణాలోనా?'' అడిగాడు రాఘవేంద్రరావు తోడల్లుళ్ళను.

''స్టార్ హోటల్లో చేస్తే బాగానే వుంటుంది. కానీ మావగారి ఫ్యాక్టరీలో సినిమా సెట్టింగ్ వంటివి వేసి అక్కడి వర్కర్లు కూడా పాల్గొనేటట్లు చేసి, బ్రహ్మాండమైన ఉత్సవం చేసి డిన్నర్ ఇస్తే అంతా సంతోషిస్తారు. మావగారు ఐసైపోతాడు. మనం ఏదడిగినా కాదనడు'' అన్నాడు సూర్యకిరణ్.

''పనిలోపనిగా మావగారి ఫోటో ప్రింట్ చేసిన మెమెంటోలు వర్కర్లకు పంచిపెట్టాలి. ఆ సందర్భంలో ఒక నెల బోనస్ ఇస్తు





న్నట్లుగా మావగారితో ఎనౌన్స్ చేయించాలి. వర్కర్స్ సంతోషిస్తారు'' అన్నాడు ప్రభు.

''ప్రభూ! నువ్వొకసారి హైదరాబాద్ వస్తే ఫ్యాక్టరీకి వెళ్ళి అక్కడ ఫంక్షన్ చెయ్యడానికి ఏ ప్లేస్ బాగుంటుందో చూసి సెలక్ట్ చేద్దాం'' అన్నాడు రాఘవేంద్రరావు.

ప్రభు అంగీకారంగా తలవూపాడు.

''నాకు తెలిసిన సినిమా ఆర్ట్ డైరెక్టర్ వున్నాడు. సెట్ వేసే పని అతనికి అప్పగించుదాం'' అన్నాడు సూర్యకిరణ్.

''ఓ.కె. బ్రదర్స్. ఇప్పుడు స్కాచ్‌బాటిల్ ఓపెన్ చేద్దాం'' అన్నాడు ప్రభు.

అంతా నవ్వారు.

★ ★ ★

రాజగోపాలరావుగారి షష్టిపూర్తికి ఇంకా మూడు నెలల గడువు వుంది. ఆయన ముగ్గురల్లుళ్ళూ ఏర్పాట్లు చేయడంలో పోటీలు పడుతూ ఆయన గుడ్‌లుక్స్‌లో వుండాలని పాట్లు పడసాగారు.

సీతారాముల కల్యాణం బొమ్మను రంగులలో ప్రింట్ చేసిన మెమెంటో క్రింద రాజగోపాలరావు దంపతుల ఫోటోలు వేయించి షష్టిపూర్తి మహోత్సవం అని రాయించారు. ఫ్యాక్టరీలో పని చేసే రెండు వేల మంది వర్కర్స్, స్టాఫ్‌కి సరిపోయినన్నింటికి పెంబర్తి కళాకారులకు ఆర్డర్ ఇచ్చారు.

సినిమా ఆర్ట్ డైరెక్టర్ ఏకాంబరం రకరకాల డిజైన్స్ తయారు చేసి సెలక్షన్ కోసం ఎదురుచూస్తున్నాడు.

బంధుమిత్రుల అడ్రసులు సేకరించే పనిలో వున్నాడు పెద్దల్లుడు. కేటరింగ్ చేసే వాళ్ళను సెలక్ట్ చేసే పని నెత్తిన వేసుకుని, డిన్నర్‌కి ఏ ఏ ఐటమ్స్ చేయాలో డిస్కస్ చేస్తున్నాడు సూర్యకిరణ్. చిన్నల్లుడు బెంగుళూరు నుంచి వారానికొకసారి వచ్చిపోతున్నాడు.

రాజగోపాలరావుగారి షష్టిపూర్తి భారీగా జరగబోతున్నదనీ, అల్లుళ్ళు చేసే హడావుడి వలన ఫ్యాక్టరీలో అందరికీ తెలిసిపోయింది. ఎం.డీగారి షష్టిపూర్తి సందర్భంలో తమకు బోనస్ వస్తుందని అంతా ఆశపడసాగారు.

తామొకటి తలచిన, దైవమొకటి తలచును అని పెద్దలు సెలవిచ్చినట్లుగా రాజగోపాలరావుగారి భార్య త్రిపురసుందరి హార్ట్ ఎటాక్‌తో కన్నుమూసింది.

అల్లుళ్ళు దిగ్భ్రాంతి చెందారు.

కూతుళ్ళు గుండెలవిసేలా దుఃఖించారు.

అంతా తల్లక్రిందులైంది.

సమస్య మొదలైంది.

★ ★ ★

ఏం చేయాలి ఇప్పుడు?

లక్షలు ఖర్చుపెట్టి చేయాలనుకున్న షష్టిపూర్తి మహోత్సవం ఆగిపోవాల్సిందేనా?

కుటుంబ పురోహితుడు రామకృష్ణశాస్త్రి అందుకు పరిష్కారం సూచించాడు.

''ఇటువంటి సమస్య పూర్వం శ్రీరామచంద్రమూర్తికి ఎదురైంది. భార్య దగ్గర లేదు. తానే స్వయంగా అడవికి పంపించాడు. అశ్వమేధయాగం చేయాలి. అందుకు యాగంలో పాల్గొనడానికి భార్య అవసరం. అందుకు బంగారు సీతను చేయించాడు''

''అవును లవకుశ సినిమాలో చూశాం.''

అల్లుళ్ళ ముఖాల్లోకి ఆనందం వచ్చింది. ''హమ్మయ్య'' అని నిట్టూర్చారు.

కూతుళ్ళు సంతృప్తిపడ్డారు. షష్టిపూర్తి వుత్సవం యధావిధిగా జరుగుతుంది అనుకున్నారు.

కానీ బంగారు విగ్రహం తయారు చేయాలంటే మాటలా? అందులోనూ త్రిపురసుందరిది భారీ కాయం. అంత బంగారం కావాలంటే రాజగోపాలరావు ఆస్తులన్నీ అమ్మినా చాలదేమో?

ఈ విషయం ఆయనతో డిస్కస్ చేయడమే మంచిదని అల్లుళ్ళు అనుకున్నారు.

రాజగోపాలరావుని కలిశారు.

''బంగారు విగ్రహం అత్తగారి సైజులో చేయాలంటే కుదరదు. వెండిరేకుతో చేయించి బంగారు పూత పూయిస్తే సరిపోతుందేమో? ఏమంటారు?'' అని ఆయన ఫీలింగ్స్ కోసం ఎదురుచూశాడు పెద్దళ్ళుడు రాఘవేంద్రరావు.

''రాఘవా! విగ్రహం చేయించాల్సిన అవసరం లేదు''చెప్పాడు రాజగోపాలరావు పెద్దల్లుడితో.

''మరి షష్టిపూర్తివుత్సవం..?'' అని నీళ్ళు నమిలాడు రాఘవేంద్రరావు.

''జరుగుతుంది!'' అన్నాడు రాజగోపాలరావు చిరునవ్వుతో.

ఆయన సెల్ మోగింది.

ఎవరితోనో చాలాసేపు మాట్లాడుతూ అటూ



## మళ్ళీ బడికి ఆర్తీ అగర్వాల్

ఆర్తీ అగర్వాల్ ఎంత ఫాస్టుగా తారాపథానికి దూసుకెళ్ళిందో అంతే ఫాస్టుగా సినిమాల్లో ఛాన్సుల్ని చేజార్చుకుంటూ వచ్చింది. అయితే తాజాగా 'అందాల రాముడు' సినిమా హిట్ కావడం ఆమెకి కాస్త ఊరట కలిగించింది. ఈ సినిమా ఆమెకి కొత్తగా అవకాశాలు తెచ్చిపెట్టకపోయినా కెరీర్‌కి కాస్త బూస్టినిచ్చిందనే చెప్పాలి. సినిమాలు అంతగా చేతిలో లేక ఖాళీగానే వున్న ఆర్తీ ముంబాయిలోని ఓ బిజినెస్ మానేజ్‌మెంట్ స్కూల్లో చేరిందిప్పుడు. ఈ కోర్సు చదువుతూనే సినిమాల్లో ఛాన్సులొస్తే నటించాలని అనుకుంటోందిట.

ఇటూ పచార్లు చేస్తున్నాడు. ముగ్గురు అల్లుళ్ళూ నిష్క్రమించారు.

★ ★ ★

ముగ్గురు అల్లుళ్ళు, కూతుళ్ళ మధ్య కాన్ఫరెన్స్ మొదలైంది.

''మామగారు బంగారంతో అత్తగారి విగ్రహం చేయిద్దామంటే ఒప్పుకోడం లేదు. అట్లా అని షష్టి పూర్తి వుత్సవం ఆగదంటున్నారు. జరుగుతుందంటున్నారు. నాకేం అర్థం కావడం లేదు'' చెప్పాడు రాఘవేంద్రరావు.

''ఇందులో అర్థంకాకపోవడానికి ఏముంది? ఈ కాలంలో విగ్రహాన్ని పక్కన పెట్టుకుని వుత్సవాలు చేసుకోవడం ఔటాఫ్ ఫ్యాషన్ అనుకుని వుంటారు. అందుకే వద్దని వుంటారు'' అన్నది శశికళ.

''నాకూ అదే అనిపిస్తున్నది వదినా! ఈ రోజుల్లో అలా చేయడం సిల్లీగా వుంటుంది కూడా'' అన్నాడు సూర్యకిరణ్.

చాలాసేపు డిస్కస్ చేసుకున్నాక ఆయన షష్టి పూర్తి వుత్సవం క్యాన్సిల్ చెయ్యకపోవడం గుడ్డిలో మెల్లగా అభిప్రాయపడ్డారు. ఐతే షష్టిపూర్తికి ఆయన భార్యతో వున్న మెమొంటోలు తయారీ క్యాన్సిల్ అయింది. మిగిలిన కార్యక్రమాలు యధావిధిగా జరగడం మొదలయ్యాయి.


కాలం గిర్రున తిరిగింది. షష్టిపూర్తి రోజు రానే వచ్చింది. గార్మెంట్ ఫ్యాక్టరీ ఆవరణలో బ్రహ్మాండమైన సినిమా సెట్టింగ్‌తో డయాస్ అలంకరణ పూర్తయింది. రంగు రంగుల తోరణాలు, మామిడి ఆకులతోను, అరటి చెట్లతోనూ కళ కళ లాడుతోంది ప్రాంగణం. విద్యుద్దీపాలు పట్టపగటి వెలుతురుని ఇస్తున్నాయి. బ్యాండ్‌మేళాలు మోగుతున్నాయి. సిటీలో ప్రముఖులంతా ఒక్కొక్కరే కార్లలో నుంచి దిగుతున్నారు. ఆ రోడ్‌లో ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులు ట్రాఫిక్ కంట్రోల్ చేస్తున్నారు.

హోండా సిటీకారు ఆ ప్రాంగణంలో ఆగింది. అది ఆ ఫ్యాక్టరీ యజమాని రాజగోపాలరావుకారు. డ్రైవర్ కారు ఆపగానే పర్సనల్ అటెండర్ కారు డోర్ తెరిచాడు. కారులోనుంచి రాజగోపాలరావు దిగాడు. ఆయన ఫుల్ సూట్‌లో అందంగా కనిపిస్తున్నాడు. ఆయన మెడలో గులాబీల పూలదండ వుంది. ఆయన వెనుకే కారు దిగింది. ఆమె సీత. బంగారు రంగు పట్టుచీరలో బ్రాండెడ్ గోల్డ్ నగలతో మెరిసిపోతోంది. సీత, రాజగోపాలరావు పర్సనల్ సెక్రటరీ. రాజగోపాలరావు తన చేతిని అందించాడు. మెడలో గులాబీ దండతో హుందాగా నడుస్తూ, యజమాని చేతిలో చెయ్యి వేసి నడుస్తున్న సీతని వర్కర్సంతా ఆశ్చర్యంగా చూశారు.

రాజగోపాలరావుగారి కూతుళ్ళు, అల్లుళ్ళు షాక్ తిన్నట్లయిపోయారు. ఒకరి ముఖాలు మరొకరు చూసుకుంటూ వుండిపోయారు.

పురోహితులు రాజగోపాలరావు, సీతను సింహాసనాల వంటి ఆసనాలలో కూర్చోబెట్టి పెళ్ళితంతు నిర్వహించారు.

''ప్రియమైన కార్మికులారా, బంధుమిత్రులారా! ఈరోజు నా షష్టిపూర్తి. మా అల్లుళ్ళు నా భార్య విగ్రహం తయారుచేయిస్తామన్నారు. కానీ ఈరోజుల్లో అరవై ఏళ్ళంటే నడివయస్సే. ఇంకా చాలా జీవితం వుంది. సీత నా పర్సనల్ సెక్రటరీగా మీకు తెలుసు. వ్యక్తిగత కారణాల వలన ఆమెకు నలభై ఏళ్ళొచ్చినా పెళ్ళికాలేదు. తండ్రి చనిపోతే తల్లిని, ఇద్దరు తమ్ముళ్ళను, చెల్లెలిని చదివించి ప్రయోజకుల్ని చేసిన త్యాగజీవి. తన జీవితాన్ని పణంగా పెట్టింది కుటుంబ ప్రయోజనం కోసం. ఆమె నా భార్య కావడం దైవ నిర్ణయం అనుకుంటున్నాను. ఆమె నా జీవితాన్ని పెద్ద మలుపు తిప్పింది. ఆర్నెల్ల క్రితం నా కూతుళ్ళు, అల్లుళ్ళు నాకు షష్టిపూర్తి చేయాలని నిర్ణయించారు. నాకు ఇష్టంలేదని చెప్పినా ఒప్పుకోలేదు. సరే వాళ్ళు ముచ్చట పడుతున్నారని ఇష్టం లేకపోయినా ఒప్పుకున్నాను. ఆరోజు వాళ్ళు నా షష్టిపూర్తి చేయాలని నిర్ణయించకపోతే ఇప్పుడు సీత నా భార్య అయ్యేది కాదు. ఎలాగంటే మూడు నెలల క్రితమే నా భార్య చనిపోయింది. షష్టిపూర్తి వుత్సవం చేయాలంటే భార్య విగ్రహం చేయించి నిర్వహించుకోవాలని పెద్దలు సలహా ఇచ్చారు. త్రేతాయుగంలో రాముడు అలాగే బంగారుసీత విగ్రహం పక్కన పెట్టుకుని యాగం చేశాడని చెప్పారు. కానీ మనం సామాన్యులం. భగవంతుడితో పోల్చుకోవడం అవివేకం అనిపించింది. ఒక దశలో షష్టిపూర్తి చేసుకోకపోతేనేం క్యాన్సిల్ చేద్దాం అనుకున్నాను. నేను ఆ వర్రీలో వున్నప్పుడు సీత కారణం అడిగింది. నేను నా సమస్య చెప్పాను. ''ఈరోజుల్లో అరవై ఏళ్ళు నడివయసు క్రింద లెక్క. మీరు మళ్ళీ పెళ్ళి చేసుకుంటే సరిపోతుంది. ఎందుకు పెళ్ళి చేసుకోగూడదూ?'' అన్నది. ''ఈ వయసులో పెళ్ళికాని కన్యలు నన్నెవరు చేసుకుంటారు? '' అన్నాను. ఆమె ఆలోచనలో పడింది. ''నాకు పిల్లలున్నారు. మళ్ళీ పిల్లలున్న విధవనో, డైవర్సీనో పెళ్ళి చేసుకుని ఆ ఫ్యామిలీ సర్కస్‌లో ఆడడం ఇష్టం లేదు అన్నాను. ''పోనీ నువ్వు నన్ను పెళ్ళి చేసుకుంటావా?'' అని అడిగాను. ''నాకు అంత అదృష్టమా?'' అన్నది. అలా ఈ సీత నాకు బంగారు సీతగా మారింది. ఈ సందర్భంలో వర్కర్లందరికీ రెండు నెలలు బోనస్ ఇస్తున్నాను'' అని ముగించాడు రాజగోపాలరావు.



## మరదే విచిత్రం!

**ఈమధ్యనే రిలీజయిన వివాహ్ షూటింగ్ సందర్భంగా ఆమధ్య- హీరో షాహిద్ కపూర్ సెల్ ఫోన్ మంటల్లో తగలడిపోయిందట. చలికాచుకునే మంట దగ్గర వున్న షాహిద్ తన మొబైల్‌ని మంటల్లో చేజార్చుకున్నాట్ట. వెంటనే యూనిట్ వాళ్ళు గబగబా ఆ మంటల్లోంచి ఫోన్‌ని బయటికి తీసారట. విచిత్రం ఏంటంటే-కాలిపోయినా కూడా ఆ ఫోన్ పనిచేయడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. మరి బర్జాత్యా సినిమా షూటింగ్‌లోని ఆ ఆప్యాయతానుబంధాలు అలాంటివి అని బాలీవుడ్ జనాలు చమత్కరిస్తున్నారు.**

ఫ్యాక్టరీ వర్కర్స్ ఆనందోత్సాహాలతో హర్షధ్వానాలు చేస్తుండగా ఆయన అల్లుళ్లు, కూతుళ్ళు నీరసపడిపోయారు.

★ ★ ★

సంవత్సరం తర్వాత బంగారు సీతకు పనసపండువంటి కొడుకు పుట్టాడు.

తనకు వారసుడు పుట్టినందుకు రాజగోపాలరావు ఫ్యాక్టరీ వర్కర్లకు మరో రెండు నెలల జీతం బోనస్‌గా ప్రకటించాడు.